# గెలుపే లక్ష్యం కావాలి

- ముున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్
- రామాయపేట పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం
- పద్మాదేవేందర్‌రెడ్డికి భారీ మెజార్టీ ఖాయం
- మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, నాయకులు



**రామాయంపేట : బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్**

రామాయంపేట/ చిలిపిచెడ్/ కొల్చారం/ చేగుంట, నవంబర్ 1 : బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలువడం ఖాయమని రామాయంపేట మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్, వైస్ చైర్మన్ పుట్టి విజయలక్ష్మి, పట్టణాధ్యక్షుడు గజవాడ నాగరాజు అన్నారు. బుధవారం రామాయంపేట శివారులోని డబుల్‌బెడ్‌రూమ్ కేసీఆర్ కాలనీ వద్ద బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. కేసీఆర్ కాలనీ సంఘం కమిటీ చైర్మన్ ప్రభాకర్ అధ్వర్యంలో వందలాది మంది కార్యకర్తలు హాజరై మా ఓటు పద్మక్కకే, మా ఆడబిడ్డ పద్మక్కను మళ్లీ భారీ మెజార్టీతో గెలిపించి సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇస్తామన్నారు. ఇండ్లులేని మాకు ఇండ్లిచ్చి ఆదుకున్న బీఆర్ఎస్‌ను మరువమని, మా ఎమ్మెల్యే పద్మక్కకే కేసీఆర్ కాలనీలో స్థానం ఉంటుందని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ మాట్లాడుతూ పద్మక్కను గెలిపిస్తే కేసీఆర్ కాలనీలో రోడ్లు, కమ్యూనిటీ హాళ్లను నిర్మించుకునే అవకాశం ఉంటుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పద్మాదేవేందర్‌రెడ్డిని మంత్రిగా చూస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. కేసీఆర్ కాలనీవాసులు పద్మాదేవేందర్‌రెడ్డికి భారీ మెజార్టీ వచ్చేలా కృషి చేయాలని కోరారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ బాదె చంద్రం, కౌన్సిలర్లు గంగాధర్, అనిల్, సుందర్‌సింగ్, నాయకులు చంద్రపు కొండల్‌రెడ్డి, చింతల యాదగిరి, దేవుని రాజు, సరాఫ్ శ్యాంసుందర్, కో ఆప్షన్ సభ్యుడు బాలుగౌడ్, కేసీఆర్ కాలనీ వాసులు చంద్రం, ఎల్లాగౌడ్, నగేశ్, పోచయ్య, రమేశ్, సిద్ధు, దేవుని శ్రీనివాస్, రవి, రాములు, నర్సింహులు, మ్యాదరి స్వామి, అనిల్, అరుణ్, శ్రీకాంత్, కమ్మరి శ్రీను, యాదేశ్, నర్సింహులు, రమేశ్, గొంగళ్ల వెంకన్న, బాలమణి, రామదాసు, స్వామి, ఇమ్రాన్, షాదుల్, బాబుమియ, చాంద్‌పాషా, యాదగిరి ఉన్నారు.

**ఎంపీపై దాడి బాధాకరం**

**★ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అశోక్‌రెడ్డి**

మెదక్ ఎంపీ, దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డిపై దాడి చేయడం బాధాకరం... ఎంపీ త్వరగా కోలుకోవాలని బీఆర్ఎస్ చిలిపిచెడ్ మండలాధ్యక్షుడు అశోక్‌రెడ్డి తెలిపారు. చిలిపిచెడ్‌లో అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాక్షేత్రంలో గెలవలేని వ్యక్తులు భౌతికదాడులను ప్రోత్సాహిస్తారన్నారు. రెండుసార్లు మెదక్ ఎంపీగా గెలిచిన ప్రభాకర్‌రెడ్డికి దుబ్బాకలో పెరుగుతున్న ప్రజాబలం చూసి ఓర్వలేక కత్తి దాడులకు పాల్పడడం బాధాకరమని అశోక్‌రెడ్డి అన్నారు.

నర్సాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అశోక్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి కారు గుర్తుకే ఓటు వేయాలని ప్రచారం చేసి సునీతారెడ్డిని గెలిపించాలని కోరారు.

**నేడు చేగుంటకు మంత్రి హరీశ్‌రావు రాక**

చేగుంట మండల కేంద్రానికి గురువారం ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు వస్తున్నట్లు బీఆర్ఎస్ కమిటీ సభ్యులు బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు.

**నేడు కొల్చారం మండలంలో ప్రచారం**

కొల్చారం మండలంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తామని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గౌరీశంకర్‌గుప్తా తెలిపారు. కొంగోడు, నాయిన్ జలాల్‌పూర్, పోతిరెడ్డిపల్లి, అంసాన్‌పల్లి, వాసురాం తండా, వెంకటాపూర్, పోతంశెట్‌పల్లి, అప్పాజిపల్లి గ్రామాల్లో సునీతారెడ్డితో పాటు ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ప్రచారంలో పాల్గొంటారని తెలిపారు.

**ప్రభాకర్‌రెడ్డి త్వరగా కొలుకోవాలి**

**★ బంగారమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు**

ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి త్వరగా కొలుకోవాలని చేగుంట మండలంలోని కాళ్లకల్ బంగారమ్మ ఆలయంలో నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఇబ్రహీంపూర్ సర్పంచ్ రాములు, సొసైటీ డైరెక్టర్ సిద్ధిరాములు, నాయకులు చందంపేట బాలశివయ్య, ఆలం శ్రీకాంత్ పాల్గొన్నారు.



**చేగుంట : కళ్లకల్ బంగరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు**



**రామాయంపేట : బీఆర్ఎస్ సమ్మేళనానికి హాజరైన కేసీఆర్ కాలనీ వాసులు**

## రక్తదానం ప్రాణదానంతో సమానం



**రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న అదనపు ఎస్పీ మహేందర్**

■ రామాయంపేట, నవంబర్ 1 : రక్తదానంతో మరో ప్రాణాన్ని కాపాడవచ్చని అదనపు ఎస్పీ మహేందర్, తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ ఏలేటి రాజశేఖర్‌రెడ్డి పేర్కొ న్నారు. బుధవారం పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా రామాయంపేట పోలీస్‌సేష్టన్‌లో అదనపు ఎస్పీ, డీఎస్పీ సహకారంతో రెడ్‌క్రాస్ సభ్యులు రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రక్తదానం చేసి, ప్రాణదాతలు కావాలన్నారు. ప్రాణాపాయస్థితిలో ఉన్నవారికి రక్తం ఉపయోగపడుతుందన్నారు. 'రక్తదానం చేయండి.. మరో ప్రాణాన్ని రక్షించండి' అనే నినాదంతో రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రామాయంపేట పోలీస్‌స్టేషన్‌లో అమరవీరుల వారోత్సవాల సందర్భంగా రక్తదానం చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసశర్మ, యాదగిరి, లక్ష్మణ్‌యాదవ్, సీఐ లక్ష్మీబాబు, ఎస్సైలు రంజిత్, అహ్మద్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## ఓటు హక్కు వినియోగంపై కళాజాత




**మాక్ పోలింగ్‌లో ఓటువేస్తున్న తహసీల్దార్ రజినీ కుమారి**

■ నిజాంపేట/ రామాయంపేట, నవంబర్ 1 : మండల కేంద్రం నిజాంపేటలో బుధవారం ఎన్నికలు, ఓటు హక్కు వినియోగంపై తెలంగాణ సాంస్కృతిక కళాసారథి కళాకారులు కళాజాత నిర్వహించారు. 'ఓటర్ల చైతన్యరథం' వేదికగా ఓటును మద్యం, డబ్బులకు అమ్మకొవద్దని కళాకారులు తమ ఆటలు, పాటలతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ సురేశ్‌కుమార్ హాజరై ప్రతి గ్రామంలో వంద శాతం ఓటింగ్ నమోదు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జగదీశ్వర్, ఎంపీవో రాజేందర్, కార్యదర్శులు, కళాకారులు పాల్గొన్నారు.

**స్నేహ కళాశాలలో ఓటరు అవగాహన**

ఓటుహక్కు వినియోగించుకోవాలని రామాయంపేట తహసీల్దార్ రజనీకుమారి, స్నేహ కళాశాలల చైర్మన్ వలిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. రామాయంపేటలోని స్నేహ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఓటు విలువైందని, ఓటు హక్కును నిర్లక్ష్యం చేయొద్దన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజు, స్నేహ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## సోలిపేట కారులో తనిఖీలు



■ చేగుంట, నవంబర్ 1 : బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకుడు సోలిపేట సతీశ్‌రెడ్డి కారును ఎన్నికల తనిఖీ బృందం సభ్యులు బుధవారం చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేశారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బోనాల్ చెక్ పోస్టు వద్ద సతీశ్‌రెడ్డి కారును ఎన్నికల తనిఖీ బృందం సభ్యులు తనిఖీ చేశారు.

## చేగుంటలో ఉచిత వైద్యశిబిరం

■ చేగుంట, నవంబర్ 1 : చేగుంట మెదక్ రోడ్డులోని విశ్రాంత భవన్‌లో బుధవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నెక్ట్స్‌జెన్ దవాఖాన సహకారంతో కంటి వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యుడు బాబాజన్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు దుర్గం అనిల్‌కుమార్, సభ్యులు నాగరాజు, అనిల్‌కుమార్, నాగరాజు, సూర్యప్రకాశ్ తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్‌లో లుకలుకలు.. అలకలు

- నర్సాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిని మార్చాలి
- ఎంపీపీ జ్యోతీసురేశ్‌నాయక్
- బీసీ వర్గానికి అవకాశం ఇవ్వాలి
- యువజన కాంగ్రెస్ నాయకుల డిమాండ్



**నర్సాపూర్ : సమావేశంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి మాట్లాడుతున్న ఎంపీపీ జ్యోతీసురేశ్‌నాయక్**

నర్సాపూర్/కొల్చారం, నవంబర్ 1 : నర్సాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి మాకు వద్దని, తక్షణమే అభ్యర్థిని మార్చాలని ఎంపీపీ జ్యోతీసురేశ్‌నాయక్ డిమాండ్ చేశారు. నర్సాపూర్ పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ ఆధ్వర్యంలో నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి రాజిరెడ్డి స్థానిక నాయకులను కలువకుండా ఇతర పార్టీలకు కోవర్టుగా పని చేస్తున్నాడని ఆరోపించారు. బేరసారాలు చేస్తున్న రాజిరెడ్డిని మార్చి బీసీ అభ్యర్థికి టికెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. రాజిరెడ్డి తనపై వస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పకుండా స్థానిక నాయకులు బేరసారాలు చేస్తున్నారని ఆరోపించడం సిగ్గుచేటన్నారు. రాజిరెడ్డి తాను చేసిన ఆరోపణలపై నర్సాపూర్ అంబేద్కర్ చౌరస్తా వద్ద చర్చకు రావాలని సవాలు విసిరారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, రిజ్వాన్, మండలాధ్యక్షుడు మల్లేశం, పట్టణాధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా, ఎంపీటీసీ లక్ష్మిఅశోక్, నాయకులు నర్సింగరావు, అజ్మత్ ఆలీ, ఉపసర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు అశోక్‌గౌడ్, ఎన్ఎస్‌యూఐ నాయకుడు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

**బీసీ అభ్యర్థికి టికెట్ కేటాయించాలి**

**★ కౌడిపల్లి బ్లాక్ అధ్యక్షుడుశ్రీనివాస్‌రెడ్డి**

నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా బీసీ వర్గానికి కేటాయించాలని బ్లాక్ కాంగ్రెస్ కౌడిపల్లి అధ్యక్షుడు ఎల్లుగారి శ్రీనివాస్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దర్జి రాజు, చిన్నాఘన్‌పూర్ సొసైటీ డైరెక్టర్ పులెబోయిన మల్లేశం డిమాండ్ చేశారు. కొల్చారం మండలంలోని చిన్నాఘన్‌పూర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి రాజిరెడ్డికి తాము సహకరించమన్నారు. పార్టీని తాకట్టు పెట్టే వ్యక్తికి టికెట్ ఇవ్వడం సరికాదన్నారు. రాజిరెడ్డి వాట్సాప్ లీడర్ అని, ఆయన అభ్యర్థిత్వాన్ని రద్దు చేసి బీసీ నాయకుడికి ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు నవీన్, ఉపసర్పంచ్‌ల ఫోరం నర్సాపూర్ మండల ఉపాధ్యక్షుడు అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.



**కొల్చారంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు**